నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 16 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు

ఎల్లూరులో పట్టుబడ్డ బియ్యంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 15 : నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ అన్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం అర్ధరాత్రి ఏల్లూరు గ్రామానికి చెందిన ఎండీ ముబాషీర్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 15 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని, పట్టుబడ్డ బియ్యాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించామన్నారు. ఆయన మాట్లాడుతూ జట్కా.. మట్కా, కోడిపందేలు, కలప రవాణా, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కోవ లక్ష్మికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు వినోద్

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రెబ్బెన మండలం ఇంద్రానగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఈ నెల 23,24,25 తేదీల్లో జరిగే జాతరకు రావాలంటూ ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ సోమవారం ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంద్రానగర్ కనకదుర్గమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. జాతర మహోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు తిరుపతి, సురేశ్, సంతోష్, జీవన్ ఉన్నారు.

కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

కాంగ్రెస్‌ను ఓడించి.. కారును గెలిపించాలి..

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలి
- బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ● కాసిపేటలో విస్తృత ప్రచారం

కాసిపేట, ఏప్రిల్ 15 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ కోరారు. సోమవారం కాసిపేట మండల కేంద్రంతో పాటు ముత్యంపల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లలో తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాలని సూచించారు. కేసీఆర్ నాయకత్వం బలపరిచిన కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ యువ నాయకులు సంజీవ్, రమేశ్, ప్రశాంత్, సాగర్, కిషోర్, రవి, అరుణ్, ప్రసాద్, సుమంత్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ఎప్పుడో!

- గుండి ప్రధాన రోడ్డు గుంతలమయం ● పెరిగిన వాహనాల రాకపోకలు ● దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- మూలమలుపు వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ప్రమాదం ● ఇకనైనా అప్రోచ్ రహదారి నిర్మించాలని వేడుకోలు

ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు వద్ద బస్సు

కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు(ఫైల్)

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా ఆసిఫాబాద్ సమీపంలో నుంచి బైపాస్ రోడ్డు వేశారు. మంచిర్యాల వైపు నుంచి వచ్చే వాహనాలు హైవే నుంచి జిల్లా కేంద్రంలోకి రావడానికి.. జిల్లా కేంద్రంలోని వాహనాలు హైవే పైకి వెళ్లడానికి పాత రహదారిని ఉపయోగించారు. అయితే, హైవేపై వెళ్లే వాహనాల వేగం ఎక్కువగా ఉండడం వల్ల, జిల్లా కేంద్రం నుంచి హైవే పైకి.. హైవే నుంచి జిల్లా కేంద్రానికి వాహనాలు వచ్చేందుకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి, జిల్లా కేంద్రం నుంచి హైవే పైకి వెళ్లడానికి ఉన్న రహదారిని మూసివేశారు. గుండి ప్రధాన రోడ్డు మీదుగా బైపాస్ నుంచి హైవే పైకి వెళ్లడానికి వాహనాలకు అనుమతి ఇచ్చారు. కాగా, జిల్లా కేంద్రంలోని గుండి దారి పక్కన నివాసముంటున్న వారికి ఇదే శాపంగా మారింది. ఈ రోడ్డు గుంతలమయమై.. కంకర తేలి అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ చేపట్టాలని గత నెలలో కాలనీవాసులు కలెక్టర్‌కు వినతి పత్రం సైతం అందజేశారు.

అప్రోచ్ రహదారి లేక అవస్థలు

జిల్లా కేంద్రం నుంచి గుండి ద్వారా వన్ వే ఏర్పాటు చేశారు. ఈ దారి గుండా మంచిర్యాల వైపు వాహనాలు వెళ్లడానికి అధికారులు నిర్ణయించారు. స్థానిక ప్రధాన రహదారి నుంచి బైపాస్ వరకు అప్రోచ్ రహదారి నిర్మించలేదు. నిత్యం వందలాది వాహనాలు ఈ దారి గుండా వెళ్తుండడంతో దుమ్మూధూళి లేచి స్థానికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇదే ప్రాంతంలో పాఠశాల ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడుతున్నారు.

రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు

అసలే ఇరుకుగా ఉన్న గుండి రోడ్డుకు వెళ్లే మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక్కడ బస్సులు, లారీలు ఇతర పెద్ద వాహనాలు తిప్పడం కష్టంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం జరిగే అవకాశాలున్నాయని, ఇకనైనా అధికారులు స్పందించాలని ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు.

ఇకనైనా అధికారులు స్పందించాలి

గుండి ప్రధాన రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. ఈ రూట్లో రోజూ వందలాది వాహనాలు వెళ్తుంటాయి. దుమ్మూధూళీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. పిల్లలు ఆడుకుంటూ బయటకు వస్తే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశముంది. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కొన్ని రోజుల కింద కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినం. ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. ఇకనైనా అధికారులు స్పందించాలి. *- ఎరుబోతు ప్రదీప్, ఆసిఫాబాద్*

రోడ్డు విస్తరణ చేపట్టాలి

ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్, మంచిర్యాల, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులను గుండి మీదుగా మళ్లించారు. వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి ఇండ్లకు వస్తుంది. ఈ రూట్లో స్కూల్ కూడా ఉంది. పిల్లలు బడికి వెళ్లే క్రమంలో ఏమైనా ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన చెందాల్సి వస్తుంది. అసలే రోడ్డు ఇరుకుగా ఉంటుంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నం. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు విస్తరణ చేపట్టాలి. *- మహేశ్‌గౌడ్, సాయినగర్, ఆసిఫాబాద్*

మెరుగైన వైద్యమందించాలి

- వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలి
- డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

వేమనపల్లి, ఏప్రిల్ 15 : వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు సూచించారు. సోమవారం వేమనపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లాలని, అత్యవసరమైతే నెత్తికి టోపీలు, రుమాలు ధరించాలని, గొడుగు వెంట తీసుకువెళ్లాలన్నారు. వైద్యాధికారి రాజేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

పెద్దపల్లి, ఏప్రిల్15: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సజావుగా సాగేలా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. నామినేషన్ల స్వీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి కలెక్టర్ సోమవారం సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18 నుంచి 25 వరకు ఉంటుందన్నారు. సమీకృత కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని వివరించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో పరిశీలించాల్సిన పత్రాలు, అభ్యర్థులకు అందించాల్సిన సూచనలు, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, తదితర అంశాలను అధికారులకు వివరించారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

పార్లమెంట్ నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్ ప్రవేశ ద్వారం నుంచి రిటర్నింగ్ అధికారి చాంబర్ వరకు చేయాల్సిన భద్రత ఏర్పాట్లను ఏసీపీ గజ్జి కృష్ణతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

సొంతగూటికి సురేందర్‌రెడ్డి

బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధం

కే సురేందర్‌రెడ్డి

మంచిర్యాల, ఏప్రిల్ 15 (మంచిర్యాల ప్రతినిధి) : నస్పూర్ మున్సిపాలిటీ, కోల్‌బెల్ట్ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి, అతని అనుచరులు భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్), టీబీజీకేఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయన సింగరేణి ఎన్నికల సమయంలో ఐఎన్‌టీయూసీలో చేరగా, తిరిగి సొంత పార్టీలోకి చేరడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడిగా పనిచేసి ఐఎన్‌టీయూసీలో చేరిన కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అతని అనుచర వర్గం తిరిగి బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌లో చేరనున్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకునట్లు తెలుస్తుంది. ఈ నెల 19న బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ దాఖలుకు వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిసింది.

ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : ఈ నెల 25 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు(టాస్) పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ పదో తరగతి పరీక్షల కోసం రెండు సెంటర్లు, ఇంటర్ కోసం రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, పదో తరగతికి చెందిన 368 మంది, ఇంటర్‌కు చెందిన 284 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, జిల్లా విద్యాధికారి అశోక్, డీఆర్వో లోకేశ్వరరావు, జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ్ బాబు, డీఆర్డీవో సురేందర్, జిల్లా వైద్యాధికారి తుకారాం బట్, భగీరథ ఈఈ వెంకటపతి, ఆర్టీసీ అధికారులు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు..

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకే నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి ఉన్నతాధికారులకు సంధాన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 90,828 మంది నిరక్షరాస్యులుగా ఉన్నారని, దశల వారీగా వీరందరినీ అక్షరాస్యులుగా మార్చాల్సి ఉందన్నారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా గ్రామస్థాయిలో ప్రధానోపాధ్యాయులు సూపర్‌వైజర్‌గా, ఒక ఉపాధ్యాయుడు టీచర్‌గా, మరో ఉపాధ్యాయుడు సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తారని, ఎప్పటికప్పుడు వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

నిబంధనల మేరకే ధాన్యం కొనాలి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

హాజీపూర్, ఏప్రిల్ 15 : నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం హాజీపూర్ మండలం గుడిపేట, రాపెల్లి, దొనబండ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, జిల్లా గ్రా మీణాభివృద్ధి అధికారి కిషన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్, తహసీల్దార్ సతీశ్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 262 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు 105, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 130, డీసీఎంఎస్‌కు 27 కొనుగోలు కేంద్రాలను కేటాయించడం జరిగిందన్నారు. మండల ప్రత్యేకాధికారులు, వ్యవసాయాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు త్వరగా పూర్తవ్వాలి

నస్పూర్, ఏప్రిల్ 15 : ఈ వేసవి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో కిషన్, డీఈవో యాదయ్యతో కలిసి అభివృద్ధి పనుల నిర్వహణపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్య కమిటీలకు రూపాంతరంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల పేరిట సంయుక్త బ్యాంక్ ఖాతా తెరిచి లావాదేవీలను నిర్వహించాల్సి ఉంటుందని, ఇందుకోసం ఒక ఉమ్మడి స్టాంప్‌ను తయారు చేయించుకోవాలని సూచించారు. పనుల పురోగతి ఫొటోలు తీసి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఏపీఎం, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్‌కు కేటీఆర్

- నేడు బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరు ● పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దిశానిర్దేశం
- తరలిరానున్న నాయకులు, కార్యకర్తలు, గులాబీ శ్రేణులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు(మంగళవారం) ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి యువ నేత హాజరుకానున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, మథోల్, ఖానాపూర్, సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 2,111 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ప్రతి పోలింగ్‌స్టేషన్ నుంచి ఇద్దరు నాయకులు, నియోజకవర్గ బాధ్యులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో యువనేత పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, జిల్లాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు, రాష్ట్రంలో నాలుగు నెలల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రస్తావించే అవకాశాలున్నాయి. యువనేత పర్యటన సందర్భంగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కులు పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల, గ్రామ స్థాయి నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన అనంతరం గులాబీ పార్టీ ప్రచారం ఉధృతం కానుంది.

బలంగా బీఆర్ఎస్

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలంగా ఉంది. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా బోథ్, ఆసిఫాబాద్ నియోజకర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఆదిలాబాద్, ఖానాపూర్, సిర్పూర్ నియోజకవర్గాల్లో తక్కువ ఓట్లతో ఓడిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చింది. ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ 4,65,476 ఓట్లు రాగా, బీజేపీకి 4,48,967 ఓట్లు, కాంగ్రెస్‌కు 2,52,281 ఓట్లు వచ్చాయి. బీజేపీ కంటే బీఆర్ఎస్‌కు 16,509 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. నిర్మల్, మథోల్ నియోజకవర్గాలకు సమన్వయ కమిటీని నియమించారు. రెండు నియోజకవర్గాల్లో కొందరు నాయకులు పార్టీని వీడినా కార్యకర్తలు చెక్కుచెదరలేదు. నేడు ఆదిలాబాద్‌లో జరిగే బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపనుంది.

ఎమ్మెల్సీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్సీ దండె విఠల్

చింతలమానేపల్లి, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో బీఎస్పీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు గోమాసె లాహాంచు, బండి రాజన్న, రౌతు మధుకర్, విలాస్, పెరుగు శంకర్‌తో పాటు 20 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్సీ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉమా మహేశ్, రాణాప్రతాప్ పాల్గొన్నారు.